క్లుప్తంగా

సదరం స్లాట్ బుక్ చేసుకోండి

తర్లుపాడు: వైకల్య ధ్రువీకరణ పత్రాల కోసం సదరం ఆన్‌లైన్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు ప్రభుత్వం స్లాట్‌లు విడుదల చేసిందన్నారు. వైకల్య ధ్రువీకరణ పత్రాలు పొందాల్సిన అభ్యర్థులు గ్రామ సచివాలయం, మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవచ్చని చెప్పారు. స్లాట్ బుక్‌చేసుకున్న వారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు స్క్రీనింగ్ నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేస్తారని స్పష్టం చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గిద్దలూరు రూరల్: కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి వాజ్‌మాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని దేవనగరంలో గురువారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. కొండా శేఖర్‌రెడ్డికి అతడి భార్యతో ఇటీవల పలుసార్లు ఘర్షణలు జరిగాయి. శేఖర్‌రెడ్డిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మస్తాపానికి గురైన శేఖర్‌రెడ్డి వాజ్‌మాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు అతడిని చికిత్స కోసం పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

ఘనంగా అల్లూరి జయంతి


అల్లూరికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కంభం: మండలంలోని తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం అల్లూరి సీతారామరాజు 127వ జయంతి ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సోని మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను, వారి త్యాగాలను మరువకూడదన్నారు. నాటి బ్రిటీష్ పాలకుల గుండెల్లో గుబులు పుట్టించిన అల్లూరి ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలుషిత నీటితో డయేరియా


మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

తర్లుపాడు: తాగునీరు కలుషితమైతే డయేరియా ప్రబలుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు స్టాప్ డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు ఇంటింటికీ వెళ్లి చిన్నారులు, తల్లులకు డయేరియాపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎప్పటికప్పుడు తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని చెప్పారు. మెడికల్ ఆఫీసర్ హరీష్, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆర్.నాగేందర్‌రెడ్డి, ఈఓఆర్డీ బాలకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నాగరాజు, మండలంలోని పంచాయతీ సెక్రటరీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి


కొనకనమిట్లలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై

కొనకనమిట్ల: టూ వీలర్స్ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని ఎస్సై కె.మాధవరావు వాహనదారులకు సూచించారు. గురువారం సాయంత్రం కొనకమనిట్ల సమీపంలో పలు వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు.

శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి


కంభంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కంభం: డయేరియా వ్యాధి ప్రబలకుండా గ్రామాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయపు సమావేశపు హాలుల గురువారం వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. మంచినీటి ట్యాంకుల వద్ద క్లోరినేషన్ చేయాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గృహపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తురిమెళ్ల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అక్తర్ రసూల్, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ


లక్ష్మీపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ


ఒందుట్లలో పునరావాస కాలనీని పరిశీలిస్తున్న జేసీ, అధికారులు

అర్ధవీడు (బేస్తవారిపేట): వెలిగొండ ప్రాజెక్ట్ ముంపు గ్రామాల్లో అర్హులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని జేసీ గోపాలకృష్ణను గ్రామస్తులు కోరారు. గురువారం మండలంలోని వెలిగొండ ప్రాజెక్ట్ ముంపు గ్రామాలైన లక్ష్మీపురం, క్రిష్ణానగర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రాజెక్ట్ నిర్మాణం ఆలస్యం కావడంతో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి అర్హత సాధించిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలన్నారు. పీఓటీ భూములకు నష్టపరిహారం ఇప్పుడున్న రేట్ల ప్రకారం ఇప్పించాలని కోరారు. ముంపు గ్రామాల్లోని ప్రజలకు ప్యాకేజీ అందిన తర్వాత ఆరు నెలల గడువు ఇస్తే ప్రతి ఒక్కరం పునరావాస కాలనీల్లో గృహాలు కట్టుకుంటామని తెలిపారు. కాకర్ల డ్యామ్, మెయిన్ కెనాల్‌ను పరిశీలించారు.

ఒందుట్లలోని పునరావాస కాలనీ పరిశీలన

బేస్తవారిపేటలోని ఒందుట్ల సమీపంలో అర్ధవీడులోని లక్ష్మీపురం, క్రిష్ణానగర్ గ్రామస్తులకు ఏర్పాటు చేసిన పునరావాస కాలనీని జేసీ గోపాలకృష్ణ, వెలిగొండ ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ ఝాన్సీలక్ష్మిలు పరిశీలించారు. కాలనీలో 75 శాతం పనులు పూర్తి చేశామని, కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో 25 శాతం పనులు నిలిచినట్లు అధికారులు తెలిపారు. లేఔట్‌లో ఎంతమందికి ప్లాట్లు కేటాయించారు, ఏఏ వసతులు పునరావాస కాలనీలో ఏర్పాటు చేస్తున్నారు, ఎంతమేర పనులు జరిగాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగజ్యోతి, వెలిగొండ ప్రాజెక్ట్ ఎస్‌ఈ అబూతాలి, ఈఈ, డీఈ, ఏఈలు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: డెంగీపై ప్రజలను అప్రమత్తం చేయాలని నగర పంచాయతీ కమిషనర్ వి.శ్రీనివాసరావు అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి నగర పంచాయతీ అధికారులు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ కార్యాలయంలో వైద్య ఆరోగ్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ డెంగీ, మలేరియా వంటి వ్యాధుల పట్ల ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. డెంగీ జ్వరాలు వచ్చిన వారిని గుర్తించి సరైన వైద్యం అందిస్తూ పరిసరాలను వెంటనే పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రయత్నిస్తామన్నారు. అర్బన్ మెడికల్ వైద్యశాల వైద్యుడు షరీఫ్, వైద్య ఆరోగ్య సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

బేస్తవారిపేట: రోడ్డు ప్రమాదంలో ఒకిరికి తీవ్ర గాయాలైన సంఘటన ఒంగోలు–నంద్యాల హైవేపై గురువారం జరిగింది. బేస్తవారిపేటకు చెందిన దూదేకుల నాయబ్‌ర సూల్ జంక్షన్‌లో గ్యాస్ గోడౌన్ వద్ద నిండు గ్యాస్‌బండను మోటార్ సైకిల్‌పై పెట్టుకుని బేస్తవారిపేట టౌన్‌లోకి వెళ్తున్నాడు. గిద్దలూరు నుంచి కంభం వైపుకు వెళ్తున్న ఆర్టీసీ బస్ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో నాయబ్ రసూల్ రోడ్డుపై పడటంతో తలకు తీగ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు కుటుంబ సభ్యులు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మార్కాపురం జిల్లా వైద్యశాలకు అక్కడి నుంచి ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు తీసుకెళ్లారు.

మార్కాపురం, పొదిలిలో ట్యాంకర్లతో నీరు

● మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

సాక్షి, అమరావతి: ప్రకాశం జిల్లా మార్కాపురం, పొదిలి మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. మార్కాపురం, పొదిలి మున్సిపాలిటీల్లో తాగు నీటి ఎద్దడిని నివారించాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి గురువారం సచివాయంలో మంత్రిని కలిసి విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. దీనిపై మంత్రి నారాయణ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఒంగోలు యూడీఏ, మార్కాపురం, పొదిలి మున్సిపాలిటీల అధికారులతో చర్చించారు. వెంటనే ట్యాంకర్ల ద్వారా తాగు నీటి సరఫరా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ముమ్మరంగా మట్టి నమూనా పరీక్షలు


మట్టి సేకరిస్తున్న సిబ్బంది

పొదిలి: రైతు భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో రైతుల పొలాల్లో ముమ్మరంగా మట్టి పరీక్షలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయాధికారి షేక్.జైనులాబ్దిన్ చెప్పారు. ఈ మేరకు ఆర్‌బీకే సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. మట్టి నమూనాలు సేకరించిన అనంతరం పరీక్షలు చేసి, రైతులకు తగు సూచనలిస్తామని చెప్పారు. మట్టి పరీక్షల కోసం వచ్చే సిబ్బందికి రైతులు సహకరించాలని, సూచనలు పాటించి లబ్ధి పొందాలని జైనులాబ్దిన్ కోరారు.

ఘనంగా కోటి కుంకుమార్చన పూజలు


కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న మహిళలు

పొదిలి: లలితా అమ్మవారి అనుగ్రహంతో ప్రజలు సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండేందుకు సామూహిక కోటి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు దీవి శ్రీకాంత్ భట్టర్, ప్రధాన అర్చక సలహాదారులు మురళీకృష్ణమాచార్యులు తెలిపారు. శ్రావణి ఎస్టేట్‌లోని పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మండల కాలం కోటి కుంకుమార్చన పూజలు పదమూడో రోజుకు చేరాయి. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయదాతల సహకారంతో తీర్థ ప్రసాదాలు, అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, ఎస్.నాగేశ్వరరావు, పునుగుపాటి కోటేశ్వరరావు, పెరుమాళ్ల భాస్కర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నీట్ పేపర్ లీకేజీ దుర్మార్గం



మార్కాపురంలో ధర్నాలో పాల్గొన్న ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ నాయకులు

● కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్
● మార్కాపురంలో విద్యా సంస్థల బంద్ విజయవంతం

మార్కాపురం: నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం మార్కాపురంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కె.విజయ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నీట్‌తోపాటు వివిధ పరీక్షల పేపర్లు లీక్ చేయడం, పేపర్లు అమ్ముకోవడం దుర్మార్గమన్నారు. ఇవన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే జరిగాయన్నారు. ఈ సంఘటనలపై ప్రధాని స్పందించకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. నీట్ పరీక్ష లీకేజీపై సుప్రీం కోర్టులో కేసు వేయడం జరిగిందని, వీటికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు న్యాయం చేయకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బంద్ సందర్భంగా పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలను మూసివేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ నాయకులు రాజేష్, అజయ్, రాము, శ్రీను, నాగూర్, కోటేశ్వరరావు, జైపాల్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో పెను ముప్పు


జూట్ బ్యాగులతో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మార్కాపురం: సమాజాన్ని నాశనం చేస్తున్న ప్లాస్టిక్ వినియోగంపై స్వీయ నియంత్రణ పాటించాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ఎస్వీఎల్, ఎస్‌సీవీకే నిలయం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఐ.బాలసుబ్బారావు, శాసనాల వీరబ్రహ్మం విజ్ఞప్తి చేశారు. మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధాన్ని కోరుతూ పలువురికి జూట్ బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం ఎక్కువ కావడం వల్ల మానవులు అనేక రుగ్మతల బారిన పడుతున్నారని, బయట పడేసిన ప్లాస్టిక్ సంచులను ఆవులు, గేదెలు తిని మరణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూరగాయలు, నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాల కోసం వెళ్లేప్పుడు ఇంటినుంచే జూట్ బ్యాగులు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, ఎస్‌సీవీకే నిలయం కోశాధికారి మల్లికార్జునరావు, సభ్యులు గొంట్ల కృష్ణ, మలిపెద్ది కేశవ, ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పాలు, పండ్లు అందజేత


రోగులకు పాలు పండ్లు పంపిణీ చేస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రి, పక్కన సంస్థ ప్రతినిధులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని కాలేజీ రోడ్డులో ఉన్న శ్రీ షిరిడీసాయి సత్సంగ సమితి 29వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం స్థానిక జీజీహెచ్‌లోని రోగులందరికీ సూపరింటెండెంట్ డాక్టర్ పి. సావిత్రి చేతులమీదుగా పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ 1995లో విశ్రాంత లెక్చరర్ ఆర్.రామచంద్రరావు సత్సంగ సమితిని ఏర్పాటు చేసి అప్పటి నుంచి సేవా కార్యక్రమాలు, సత్సంగ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ సాయినాథుడు చూపిన మార్గంలో ఒకరికొకరు సాయం చేసుకుంటూ కలిసిమెలసి ఉండాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు మంజూరు చేయాలి


నిరసన దీక్ష చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కొమరోలు: పారిశుధ్య కార్మికుల వేతనాలు మంజూరు చేసేంత వరకు నిరసన దీక్షలు కొనసాగుతాయని పారిశుధ్య కార్మికులు తెలిపారు. మండల కేంద్రం కొమరోలులోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛ భారత్ కార్మికుల వేతనాలను గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు 30 నెలలుగా ఆపివేయడంతో 3 రోజులుగా నిరసన దీక్షలు గ్రామ సచివాలయం ఎదురుగా కార్మికులు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా 3వ రోజు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన దీక్షలు చేపట్టారు. వీలైనంత త్వరగా జీతభత్యాలను విడుదల చేయాలని పారిశుధ్య కార్మికులు వేడుకుంటున్నారు.

పెరిగిన చిల్లచెట్లతో ఇబ్బందులు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలోని రాజానగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రోడ్డుకు అడ్డంగా చిల్లచెట్లు పెరగడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఉన్న చిల్లచెట్లు రోడ్డు మీదకు పెరిగి పోవడంతో వాహనదారుల రాకపోకలు ఇబ్బందిగా మారాయి. చిల్లచెట్లను తొలగించాలని నగర పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా పెరిగిన చిల్లచెట్లను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుకు అడ్డంగా పెరిగిన చిల్లచెట్లు

విద్యార్థి సంఘాల ఆందోళన



ఆందోళన చేపడుతున్న విద్యార్థి సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: నీట్ పరీక్షల్లో అవకతవకలకు నిరసనగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపడుతూ పట్టణంలోని పలు విద్యా సంస్థలను గురువారం మూత వేయించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నీట్ పరీక్షల్లో అవకతవకలకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను స్వచ్ఛందంగా మూతేయించారు. ప్రభుత్వ పాఠశాలలు మూతవేయలేదని తెలుసుకున్న విద్యార్థి సంఘ నాయకులు జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల వద్దకు వెళ్లి అక్కడి ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

హిందువులపై చులకన భావం హేయం


డీటీకి అర్జీ అందజేస్తున్న విజయలక్ష్మి తదితరులు

పొదిలి: హిందువులను రాహుల్ గాంధీ చులకనగా మాట్లాడటాన్ని ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాగులూరి రామయ్య, మండల నాయకులు మునగాల కిరణ్‌కుమార్, సాదు కోటేశ్వరరావు, మాతట్టి నాగేశ్వరరావు, దిబ్బారెడ్డి, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

వద్దిమడుగులో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఊర్మిళ, నాయకులు

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు గ్రామంలో గురువారం మార్కాపురం పట్టణానికి చెందిన ఊర్మిళ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యద్దనపూడి విలియమ్ పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు, గ్రామ సర్పంచ్ పిన్నిక పిచ్చయ్యయాదవ్, ఎంపీటీసీ సభ్యుడు చక్కెర వెలుగొండయ్య, ఉప సర్పంచ్ బూదాల యూతాం ప్రారంభించారు. వైద్య శిబిరంలో 85 మందికి డాక్టర్ ఊర్మిళ ఉచితంగా పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు వైద్యసేవలు అందించటం అభినందనీయమన్నారు.

రేపు రేగడపల్లిలో శ్రీవారి ఆలయ తృతీయ వార్షికోత్సవం


ముస్తాబైన వెంకటేశ్వరస్వామి ఆలయం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు విజయ్‌కాంత్‌శర్మ, నిర్వాహకులు పాతకోట శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఉదయం అర్చనలు, అభిషేకాలతో పాటు 10 గంటలకు వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అన్న సంతర్పణ, సాయంత్రం స్వామివారి రథోత్సవం ఉంటుందని వివరించారు.